


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

శనివారం

20-09-2025

పేజీలు: 02





## నవంబర్ 14న శివ రీరిలీజ్

మన టాలీవుడ్ ఎవర్ గ్రీన్ మన్మథుడు కింగ్ నాగార్జున హీరోగా మాత్రమే కాకుండా ఇపుడు మరిన్ని సినిమాల్లో కీలక పాత్రలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఎన్నో ఏళ్ళ నుంచి కింగ్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్న అవైటెడ్ రీరిలీజ్ సినిమా ఏదన్నా ఉంది అంటే అది “శివ” అని చెప్పాలి. ఇండియన్ సినిమా దగ్గర ఒక ట్రెండ్ సెట్టింగ్ చిత్రంగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మతో చేసిన ఈ ఐకానిక్ ప్రాజెక్ట్ రీరిలీజ్ కోసం ఎప్పుడు నుంచో మంచి ఆసక్తి నెలకొంది. త్వరలో అంటూ ఊరిస్తూ వచ్చారు. కానీ రిలీజ్ డేట్ మాత్రం రివీల్ చేయలేదు. కానీ ఫైనల్ గా నేడు అక్కినేని నాగేశ్వరరావు గారి జయంతి సందర్భంగా మేకర్స్ అవైటెడ్ శివ రీ రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. దీనితో ఈ చిత్రం ఈ నవంబర్ 14న గ్రాండ్ గా రిలీజ్ కి వస్తున్నట్టుగా ఖరారు చేశారు. మరి రీరిలీజ్ లలో శివ ఎలాంటి రికార్డ్స్ సెట్ చేస్తుందో చూడాలి. ఇక ఈ చిత్రంలో అమల హీరోయిన్ గా నటించగా రఘువరన్ విలన్ గా నటించారు. అలాగే మ్యాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించారు.

# జాలీ ఎల్ ఎల్ బి 3 రివ్యూ

బాలీవుడ్‌లో కోర్ట్ డ్రామా చిత్రంగా తెరకెక్కిన మూవీ ‘జాలీ ఎల్‌ఎల్‌బి 3’ నేడు రిలీజ్ అయింది. మరి ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతవరకు మెప్పించిందో ఈ రివ్యూలో చూద్దాం. ఢిల్లీ కోర్ట్ లో జగదీశ్వర్ మిశ్రా అలియాస్ జాలీ (అక్షయ్ కుమార్), జగదీశ్ త్యాగి అలియాస్ జాలీ (అర్షద్ వార్సి) తరుచూ గొడవ పడుతుంటారు. వారు ఓ మహిళా రైతు కేసులో ఇంపీరియల్ గ్రూప్ అధినేత హరిభాయ్ ఖేతాని(గజ్‌రాజ్)కి ఎదురువెళ్తారు. మరి ఈ కేసుని ఎవరు టేక్ అప్ చేశారు..? హరిభాయ్ ఖేతానికి వ్యతిరేకంగా వారికి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? చివరికి ఈ కేసు ని ఎవరు గెలిపించారు? అనేది సినిమా కథ. కోర్ట్ డ్రామా చిత్రాలలో జాలీ ఎల్‌ఎల్ బి కి ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. మొదటి రెండు చిత్రాలు ప్రేక్షకులకు మంచి కంటెంట్ తో పాటు పెర్ఫార్మన్స్ లు ఇచ్చాయి. ఇక ఇప్పుడు వచ్చిన మూడో చిత్రం కూడా అదే తరహాలో కొనసాగింది. ఇక ఈసారి ఇద్దరు జాలీలు ఈ సినిమాలో కనిపించడం ప్లస్ పాయింట్ అని చెప్పాలి. అక్షయ్ కుమార్, అర్షద్ వార్సి తమదైన పర్ఫార్మెన్స్‌లతో ప్రేక్షకులను మెప్పించారు. రైతుల పట్ల కార్పొరేట్ కంపెనీలు వ్యవహరించే తీరును మన కళ్లకు కట్టినట్లు చూపెట్టారు. రైతుల భూములను కార్పొరేట్ సంస్థలు ఎలా కైవసం చేసుకుంటాయి.. వాటి ఫలితంగా గ్రామాల్లో రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటారు అనేది మనకు ఈ సినిమాలో వివరంగా చూపెట్టారు. ఫస్ట్ హాఫ్‌లో హీరోల మధ్య పోటీ, వారు ఒకరిపై ఒకరు గెలిచేందుకు చేసే ప్రయత్నాలు కొంతవరకు ఆకట్టుకుంటాయి. అయితే, రైతు కేసుని వారు టేకప్ చేసిన తర్వాత కథ సీరియస్ మోడ్‌లోకి మారుతుంది. ఆ




తర్వాత ఎలాంటి పరిణామాలు జరిగాయనేవి చక్కగా చూపెట్టారు. కథకు అనుగుణంగా వచ్చే బీజీఎం కూడా మెప్పిస్తుంది. గజ్‌రాజ్ తనదైన నటనతో ఆకట్టుకుంటాడు. ఈ ఫ్రాంచైజీలో జడ్జీగా నటించిన సౌరబ్ శుక్లా మరోసారి ఈ సినిమాతో మెరిసారు. ఆయన తనదైన యాక్టింగ్‌తో ఈ సినిమాకు ప్రాణం పోశారు. మిగతా నటీనటులకు పెద్దగా స్కోప్ లేకుండా పోయింది. కథను ముందుకు తీసుకెళ్లిన తీరు ప్రేక్షకులను మెప్పిస్తుంది. గత రెండు సినిమాలను చూసిన వారికి ఈ సినిమా పెద్దగా నచ్చదని చెప్పాలి. గత రెండు చిత్రాల్లో కూడా కోర్టు రూమ్‌లో డ్రామా ఆకట్టుకుంటుంది. కానీ, ఇందులో కోర్టు సీన్స్ తక్కువగా ఉండటం.. సమస్యకు సంబంధించిన సీన్స్ ఎక్కువగా ఉండటం కొంతవరకు మైనస్. నటీనటుల విషయంలోనూ హీరోలు ఇద్దరు ఉన్నా క్రెడిట్ మాత్రం జడ్జీగా నటించిన సౌరబ్ శుక్లా కొట్టేశారు. అక్షయ్ కుమార్ పర్వాలేదనిపించినా, అర్షద్ వార్సి పాత్ర ఇంకా బెటర్‌గా ఉండాలి అనిపిస్తుంది. మిగతా నటీనటులకు ప్రాధాన్యత దక్కలేదని చెప్పాలి. కథలోకి తీసుకెళ్లేందుకు దర్శకుడు చాలా సమయం తీసుకున్నాడు. ఇది ప్రేక్షకులకు బోర్ కొట్టించింది. ఇక సీరియస్‌గా సాగుతున్న సెకండాఫ్‌లోనూ చాలా చోట్ల ట్రాక్ తప్పినట్లు అనిపిస్తుంది. కొన్ని కామెడీ సీన్స్ అనవసరంగా పెట్టారని.. ఒక ఎమోషనల్ సాంగ్‌ను వేస్ట్ చేశారని అనిపిస్తుంది. క్లైమాక్స్‌ను కూడా మరింత మెరుగ్గా రాసుకుని ఉండాల్సింది. దర్శకుడు సుభాష్ కపూర్ ఎంచుకున్న కథ చాలా రొటీన్‌గా అనిపించింది. దేశంలో చాలా రైతు సమస్యలు ఉన్నాయి. అందులో ఈ కథ చాలా పాతది గా అనిపిస్తుంది. ఇక స్క్రీన్ ప్లే విషయంలోనూ ఆయన చాలా జాగ్రత్తగా ఉండాల్సింది. కథను వివరించే క్రమంలో చాలా ల్యాగ్ సీన్స్ కనిపిస్తాయి. సంగీతం పరంగా సాంగ్స్ పెద్దగా ఆకట్టుకోవు. అయితే, బీజీఎం మాత్రం బాగుంది. సినిమాటోగ్రఫీ వర్క్ బాగుంది. ఎడిటింగ్ వర్క్ ఇంకా బెటర్‌గా ఉండాల్సింది. నిర్మాణ విలువలు బాగున్నాయి. ఓవరాల్‌గా చూస్తే, ‘జాలీ ఎల్‌ఎల్‌బి 3’ చిత్రం గతంలో వచ్చిన రెండు చిత్రాలు క్రియేట్ చేసిన ఇంపాక్ట్‌ను అందుకోవడంలో తడబడింది. అక్షయ్ కుమార్, అర్షద్ వార్సి, సౌరబ్ శుక్లా ఈ సినిమాలో తమ పర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకుంటారు. కోర్టు సీన్స్ ప్రేక్షకులను మెప్పిస్తాయి. అయితే, వీక్ రైటింగ్, కథలో ఆకట్టుకునే అంశం లేకపోవడం, సాగదీత సీన్స్ ఈ చిత్రానికి మైనస్. కోర్టు డ్రామాలను ఇష్టపడేవారు, జాలీ ఎల్‌ఎల్‌బి ఫ్రాంచైజీలను ఫాలో అయ్యేవారు ఈ సినిమాను తక్కువ అంచనాలతో చూడడం బెటర్.



## కండువా కప్పితే పార్టీ మారినట్లేనా

కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారిన అంశంపై భారత రాష్ట్ర సమితి నేతలకే స్పష్టత లేదని సిఎం రేవంత్ ఎద్దేవా చేశారు. హరీష్ రావే తమకు 37 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని అసెంబ్లీలో చెప్పారని, ఇది ఆన్‌రికార్డు అని సిఎం రేవంత్ అన్నారు. కెటిఆర్ ఎమ్మెల్యేల గురిం చి ఇంకో సంఖ్య చెబుతున్నారని సిఎం రేవంత్ ఎద్దేవా చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీ ఫిరాయింపులపై నిర్దిష్ట నియమాలు ఏమీ లేవని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలన్నారు. కండువా వేసుకున్నంత మాత్రాన పార్టీ ఫిరాయించినట్టేనానని సిఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.



# వదలని బ్యాడ్ లక్

హీరోయిన్ పూజా హెగ్డే గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. తెలుగు, తమిళం భాషలలో అగ్ర హీరోలందరితో కలిసి నటించి స్టార్ డమ్ సంపాదించుకుంది. తక్కువ సమయంలోనే వరుస సినిమాలతో దూసుకుపోయిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు మాత్రం సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తుంది. మోడలింగ్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చిన ఈ అమ్మడు.. ముకుంద, ఒక లైలా కోసం సినిమాలతో తెలుగు తెరకు పరిచయమైంది. కెరీర్ మొదట్లో ప్లాపులే అందకున్నప్పటికీ అందం, అభినయంతో మెస్మరైజ్ చేసింది. దీంతో ఈ బ్యూటీకి ఆఫర్స్ క్యూ కట్టాయి. దువ్వాడ జగన్నాథం, అరవింద సమేత, మహర్షి, గద్దలకొండ గణేష్, అలా వైకుంఠపురంలో వంటి చిత్రాలతో వరుసగా హిట్లు అందుకుంది. అయితే వరుస హిట్లే కాదు..





## సీనియర్ జర్నలిస్టు మూర్తిపై మంచు లక్ష్మి ఫిర్యాదు

మంచు మోహన్‌బాబు కుమార్తెగా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన నటీమణి మంచు లక్ష్మి ఎప్పటికప్పుడు తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ని సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఆమె నటించిన దక్ష — ది డెడ్‌లీ కాన్స్పిరసీ చిత్రం విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ప్రమోషన్లలో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో సీనియర్ సినీ జర్నలిస్టు వీఎస్ఎన్ మూర్తికి ఇచ్చిన ఇంటర్వ్యూ వివాదంగా మారింది.ఇంటర్వ్యూలో మూర్తి “50 ఏళ్లకు దగ్గరవుతున్న మీరు ఎందుకు ఇలాంటి డ్రెస్సులు వేసుకుంటున్నారు?” అని ప్రశ్నించగా, మంచు లక్ష్మి తీవ్రంగా స్పందించారు. “ఇలాంటి ప్రశ్న అడిగే ధైర్యం మీకు ఎక్కడి నుంచి వచ్చింది? మహేశ్ బాబుకి కూడా 50 ఏళ్లు వస్తున్నాయి. ఆయన షర్ట్ ఎందుకు విప్పి తిరుగుతున్నారు అని మీరు అడగగలరా? ఒక మహిళను ఎందుకు ఇలాగే ప్రశ్నిస్తారు?” అంటూ ఆమె కడిగిపారేశారు.ఈ ఘటనపై నెటిజన్లు మంచు లక్ష్మికి మద్దతు తెలుపుతూ “కరెక్ట్‌గా బుద్ధి చెప్పావు అక్కా” అంటూ కామెంట్లు చేశారు. అయితే ఈ వ్యవహారాన్ని ఆమె అక్కడితో వదలకుండా తాజాగా ఫిల్మ్ ఛాంబర్‌కు ఫిర్యాదు చేశారు.

## యూపీలో తోడేళ్ల దాడిలో చిన్నారి మృతి

యూపీలోని బహ్రైచ్ జిల్లాలో తోడేళ్ల దాడులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గత వారం రోజుల్లో ఆరు దాడులు జరగగా, ఒక చిన్నారి మృతి చెందింది. మరో మహిళ, యువకుడితో సహా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అటవీ శాఖ అధికారులు తోడేళ్లను పట్టుకునేందుకు పంజరాలు ఏర్పాటు చేసి, డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచారు. గత ఏడాది కూడా ఇలాంటి దాడులు జరిగి భయంతో జీవించినట్లు స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు.




## గుర్తింపు లేని 474 పార్టీలను రద్దు చేసిన ఈసీ

ఎన్నికల సంఘం (ఈసీ) దేశవ్యాప్తంగా గుర్తింపు లేని 474 రాజకీయ పార్టీలను రద్దు చేసింది. వీటిలో ఆంధ్రప్రదేశ్ నుంచి 17, తెలంగాణ నుంచి 9 పార్టీలు ఉన్నాయి. గత ఆరేళ్లలో ఒక్క ఎన్నికల్లో కూడా పోటీ చేయని పార్టీలను ఈసీ తొలగించింది. ఆగస్టులో 334 పార్టీలను రద్దు చేయగా, తాజాగా రద్దు చేసిన 474తో కలిపి రెండు నెలల్లో మొత్తం 808 పార్టీలను ఈసీ రద్దు చేసింది. ఎన్నికల్లో పాల్గొనని పార్టీలను జాబితా నుంచి తొలగించాలని ఈసీ నిర్ణయించింది.



## మరో 3రోజులు వర్షసూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావంతో గత మూడురోజులుగా కురుస్తున్న కుండపోత వానతో నగరం తడిసి ముద్దైంది. తాజాగా శుక్రవారం రాత్రి నగరంలోని పలు చోట్ల కురిసిన భారి వానతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై మోకాళ్లోతు వర్షం నీరు చేరడంతో రహదారులన్నీ చెరువులను తలపించాయి. దీంతో నగరంలో మళ్లీ ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. రాత్రి 10గంటల వరకు నాగోల్ బండ్లగూడలో అత్యధికంగా 9.33 సెం.మీలు, సరూర్‌నగర్‌లో , హయత్‌నగర్‌లో 6.13 సెం.మీలు, వనస్థలిపురంలో 6.0సెం.మీలు, సరూర్‌నగర్‌లోని మధురానగర్‌లో 4.38, రామంతాపూర్‌లో 3.28, మూసారాంబాగ్‌లో 3.03సెం.మీలు, హస్తినాపురంలో 2.95, అంబర్‌పేటలో 2.20సెం.మీల చొప్పన వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. ఆవర్తన ప్రభావంతో రాగల మరో 3రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు, మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

సూర్య www.suryaa.com EVENING 4 PM EDITION

## కుషాయిగూడలో దారుణం.. భార్యను నరికి చంపిన భర్త

హైదరాబాద్‌లోని కుషాయిగూడలో దారుణం చోటుచేసుకున్నది. భార్యను నరికిన భర్త పరారయ్యాడు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు సమీపంలోని అడ్డగూడురుకు చెందిన బోడ శంకర్, మంజుల దంపతులు గత కొంతకాలంగా కూషాయిగూడలో ఉంటున్నారు. వారికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, నాలుగు రోజుల క్రితం కుటుంబంతో కలిసి మహేశ్ నగర్ కాలనీలో ఉంటున్న సోదరి ఇంటికి శంకర్ వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత అంతా నిద్రలో ఉండగా భార్యను కత్తితో నరికాడు. ఆమె కేకలు వేడంతో అంతా నిద్ర లేచారు. దీంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలిని దవాఖానకు తరలింగా ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.



## ఫిరాయింపు ఎంఎల్ఎలకు మళ్లీ నోటీసులు

'మీ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరినట్లు మీ వద్ద ఇంకా ఏమైనా ఆధారాలు ఉన్నాయా?' అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బిఆర్ఎస్‌కు నోటీసు పంపించారు. అదే విధంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కూడా స్పీకర్ కార్యాలయం నుంచి శుక్రవారం నోటీసులు జారీ అయ్యాయి. తాము పార్టీ మారలేదు, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామని అనడానికి ఇంకా మీ వద్ద ఇంకా ఏమైనా ఆధారాలు ఉన్నాయని ఎమ్మెలకు పంపించిన నోటీసులలో స్పీకర్ పేర్కొన్నట్టు తెలిసింది. కాగా తమ పార్టీకి చెందిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరినందున వారిపై పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ ఇదివరకే స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అయితే స్పీకర్ నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తున్నారని, కనీసం ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు కూడా ఇవ్వలేదని బిఆర్ఎస్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీంతో సుప్రీం కోర్టు ఈ నెలాఖరులోగా విచారణ ప్రారంభించాలని ఆదేశించింది. దీంతో కాంగ్రెస్‌లో చేరారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల అనర్హత పిటీషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ ప్రారంభించారు. తొలుత బిఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్ల ఆధారంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు పంపించగా, వారిలో ఎనిమిది మంది లిఖితపూర్వకంగా సమాధానాలు అందజేశారు.



## ఎపి విద్యార్థులకు గుడ్ న్యూస్

దసరా పండగ సందర్భంగా విద్యార్థులకు ఎపి ప్రభుత్వం గుడ్‌న్యూస్ తెలిపింది. ఉపాధ్యాయుల కోరిక మేరకు మరో రెండు రోజులు స్కూళ్లకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈ నెల 22వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా సెలవులు మంజూరు చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్ అధికారిక ప్రకటన చేశారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ నెల 24 నుంచి అక్టోబర్ 2 వరకు దసరా సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా మార్పు చేయడంతో ఎపిలో పాఠశాలలకు మరో రెండు రోజులు అదనంగా సెలవులు వచ్చాయి. పాఠశాల సెలవులు పొడిగించాలని మంత్రి లోకేశ్ ను టిడిపి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు కోరారు. దీంతో వారి కోరిక మేరకు విద్యాశాఖ అధికారులతో చర్చించి ఎపి ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ప్రకటించింది.

## పోచారం ప్రాజెక్టులో తగ్గు ముఖం పడుతున్న వరద




కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం పోచారం ప్రాజెక్టులో శనివారం ఉదయం వరద తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టు డీఈ షేర్ల వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం, జలాశయంలోకి 1637 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. 40 క్యూసెక్కుల నీరు ఆవిరవుతుండగా, 1597 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు కట్టపై నుండి మంజీర నది ద్వారా నిజాంసాగర్ రిజర్వాయర్ లోకి వెళ్తోంది. ఈ ఖరీఫ్ సీజన్లో ఇప్పటివరకు 21.725 టీఎంసీల వరద నీరు పోచారం ప్రాజెక్టు నుండి మంజీర ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్ లోకి వెళ్ళింది.




## మఫ్టీ పోలీసు టీజర్ రిలీజ్

యాక్షన్ కింగ్ అర్జున్ మరియు ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలో నటించిన 'ముఫ్తి పోలీస్' ఒక మిస్టరీ థ్రిల్లర్. దినేష్ లక్ష్మణన్ రచన మరియు దర్శకత్వం వహించిన ఈ చిత్రం త్వరలో విడుదలకి సిద్ధంగా ఉంది. మేకర్స్ ఈ సినిమా టీజర్‌ను ఆవిష్కరించారు. ఒక రచయిత రాసిన కథ అర్జున్ దానితో ఏదో సరైనది కాదని భావిస్తున్నందున అతను దృష్టిని ఆకర్షిస్తాడు. మిస్టరీలోకి ఆకర్షించబడిన కథానాయకుడు అనేక జవాబు లేని ప్రశ్నలకు పరిష్కారాలను కనుగొనటానికి బయలుదేరాడు మరియు ఈ ప్రక్రియలో అతను బహుళ సవాళ్లను ఎదుర్కొంటాడు. అర్జున్ ఏమి కనుగొనటానికి ప్రయత్నిస్తున్నాడు? అనేది సినిమాలో తెలుస్తుంది. ఈ సినిమాలో అభిరామి వెంకటచలం, ప్రవీణ్ రాజా, లోగో, రామ్ కుయార్, వెలారామ మూర్తి మరియు ఇతరులు కీలక పాత్రల్లో నటించారు. జి. అరుల్ కుమార్ ఈ చిత్రాన్ని జిఎస్ ఆర్ట్స్ బ్యానర్ కింద నిర్మించారు. ఈ చిత్రానికి భరత్ ఆసివగన్ సంగీత స్వరకర్తగా ఉన్నారు.

## అన్నమయ్య జిల్లాలో వరద నీటిలో గల్లంతై నలుగురు మృతి



అన్నమయ్య జిల్లాలో విషాదం నెలకొంది. వరద నీటిలో గల్లంతై నలుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఇలియాస్(6) అనే బాలుడు వరద వల్ల మురుగు నీటిలో పడిపోయాడు. అప్రమత్తమైన తల్లి తన కుమారుడిని కాపాడేందుకు యత్నించగా ఆమె కూడా ఆ కాల్వలో పడిపోయింది. వీరిద్దరిని కాపాడేందుకు గణేశ్(30) యువకుడు యత్నించాడు. చివరకు అతను వరదకు కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గవర్నర్ కళ్యాణ మండపం సమీపంలో ముగ్గురి మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. మరోవైపు రాయచోటి పట్టణంలోనే కే.రామాపురంలో స్కూల్ నుండి పిల్లలను తీసుకొని వస్తుండగా వరదలో ఆటో చిక్కుకుపోయింది. ఆటోలో ఉన్న ఆరుగురు విద్యార్థులు వరద ఉధృతికి కొట్టుకుపోయారు. స్థానికులు గమనించి ఐదుగురు పిల్లలను కాపాడారు. ఒకటో తరగతి యామిని(7) వరదలో గల్లంతై ప్రాణాలు కోల్పోయింది.

## వేములవాడలో దారుణం.. కారులో మాజీ కౌన్సిలర్ హత్య..



మనుషులు మానవత్వాన్ని మరిచిపోయారు. డబ్బు, భూమి కావాలనే ఆశతో.. మానవతా విలువలు మరిచిపోయి.. స్వార్థం, రాక్షసత్వానికి అలవాటు పడుతున్నారు. డబ్బు కోసం మన, తన అనీ తేడాలు లేకుండా దారుణాలకు ఒడిగడుతున్నారు. సొంత వ్యక్తులను కూడా కడతేర్చుతున్నారు. దొంగతనాలు, మోసాలు చేస్తూ.. పోలీసులకు పట్టుబడి జైలుపాలు అవుతున్నారు. తాజాగా.. భూమి కోసం కొందరు దుండగులు ఓ దారుణానికి పాల్పడిన ఘటన వేములవాడ పట్టణంలో వెలుగు చూసింది. వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ పరిధిలోని అగ్రహారం వెంచర్ వద్ద దారుణం జరిగింది. కారులో రియల్ ఎస్టేట్ వ్యాపారి, మాజీ కౌన్సిలర్ రమేష్(48)ను గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసి హత్య చేశారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు పోలీసులు. అనంతరం ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం.. స్థానిక ఆసుపత్రికి తరలించారు. భూ తగాదాల విషయంలోనే హత్య జరిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మొదటి నుంచి రియల్ ఎస్టేట్ రంగంలో వివాదాస్పద వ్యక్తిగా రమేష్‌కు పేరున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే భూ తగాదాలలో పలుమార్లు రమేష్ జైలుకి వెళ్లి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## టీ20 వేగంగా 100 వికెట్ల తీసిన భారత బౌలర్‌గా రికార్డు




ఆసియా కప్‌లో భాగంగా ఒమన్‌తో జరిగిన చివరి గ్రూప్ దశ మ్యాచ్‌లో భారత ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ అరుదైన ఫీట్‌ను సాధించాడు. ఒక వికెట్‌ను పడగొట్టి అంతర్జాతీయ టీ20లో వంద వికెట్ల తీసిన భారతీయ బౌలర్‌గా ఘనత సాధించాడు. అబుదాబిలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 188 పరుగులు చేసింది. ఆ తర్వాత ఒమన్ జట్టు నిర్ణీత ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 167 పరుగులు మాత్రమే చేయగలిగింది. అయితే, ఆమిర్ కలీమ్, హమ్మద్ మీర్జా 93 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి టీమిండియా బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్నారు. కానీ, ఈ ఇద్దరు జట్టును విజయ తీరాలకు చేర్చలేకపోయారు. ఇక టీ20లో అంతర్జాతీయ క్రికెట్లో అత్యంత వేగంగా వంద వికెట్లు తీసిన బౌలర్‌గా అర్ష్‌దీప్ నిలిచాడు. అంతర్జాతీయ టీ20లో వంద వికెట్లు తీసిన ఈ ఫాస్ట్ బౌలర్ కేవలం 64 మ్యాచ్‌ల్లోనే ఈ మైల్‌స్టోన్‌ను చేరుకున్నాడు. ఈ ఘనత సాధించిన ప్రపంచంలోనే మూడో బౌలర్‌గా నిలిచాడు. అత్యంత వేగంగా వంద వికెట్లు తీసిన రికార్డు ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ పేరిట ఉన్నది. కేవలం 53 మ్యాచుల్లోనే ఈ మైలురాయిని చేరాడు. ఆ తర్వాత శ్రీలంకకు చెందిన వానిందు హసరంగా 63 మ్యాచ్‌ల్లో 100 వికెట్లు సాధించాడు. అర్ష్‌దీప్ తర్వాత.. పాకిస్తాన్‌కు చెందిన హారిస్ రౌఫ్ (71 మ్యాచ్‌లు), ఐర్లాండ్‌కు చెందిన మార్క్ అడైర్ (72 మ్యాచ్‌లు) ఈ జాబితాలో ఉన్నారు.

## రేపటి నుంచి కొనసాగనున్న ఆరోగ్య శ్రీ సేవలు




రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన ఆరోగ్య శ్రీ సేవలు శనివారం నుంచి యథావిధిగా కొనసాగనున్నాయి. ఇకపై ప్రతి నెల నిధులు విడుదల చేస్తామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆరోగ్యశ్రీ నెటవర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు బకాయిలపై చర్చించారు. ఈ సందర్భంగా రాజనర్సింహ వాళ్లతో ప్రతి నెలా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. అంతేకాదు హాస్పిటళ్లు కోరుతున్న ఇతర అంశాలపై కూడా త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా.. పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వానికి సహకరిస్తున్న ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటళ్లను మంత్రి అభినందించారు. రాజనర్సింహ చొరవతో తిరిగి ఆరోగ్య శ్రీ సేవలు శనివారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. పెండింగ్ బకాయిలు చెల్లించాలని సెప్టెంబర్ 16 అర్ధ రాత్రి నుంచి ఆరోగ్య శ్రీ సేవల్ని నిలిపివేసిన విషయం తెలసిందే.

## గ్లామర్‌తో హీట్ పెంచిన కియారా అద్వానీ

ఎంఎస్ ధోని సినిమాతో దేశం మొత్తాన్ని ఆకర్షించిన కియారా అద్వానీ ప్రస్తుతం బాలీవుడ్ లో టాప్ హీరోయిన్ గా దూసుకెళ్తుంది. రీసెంట్ గా గేమ్ ఛేంజర్ తో ప్రేక్షకుల ముందుకొచ్చిన కియారా ఆ సినిమాతో డిజాస్టర్ అందుకుంది. ప్రస్తుతం అమ్మడి చేతిలో రెండు మూడు సినిమాలున్నాయి. మరో రెండు ఓకే చేయాలని చూస్తుంది. ఇంత బిజీ టైమ్ లో కూడా కియారా తన సోషల్ మీడియాలో రెగ్యులర్ ఫోటోలను షేర్ చేస్తూ ఫ్యాన్స్ ను అలరిస్తూ ఉంటుంది. తాజాగా అమ్మడు బ్లాక్ అవుట్‌ఫిట్ లో క్లీవేజ్ షో చేస్తూ శిల్పంలా నిల్చుని ఫోటోలకు పోజులిచ్చింది. ఈ అవుట్‌ఫిట్ లో కియారా శిల్పం లాగా ఉందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

